క్లుప్తంగా

అక్రమ అడ్మిషన్లపై చర్యలేవీ..?

కడప ఎడ్యుకేషన్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డిఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం పాఠశాల విద్య ఆర్జేడీ కాగిత శామ్యూల్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నారాయణ, చైతన్యతోపాటు మరికొన్ని కార్పొరేట్, ఇంటర్నేషనల్ విద్యాసంస్థలు విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో ఒకటి రెండు బ్రాంచ్‌లకు పర్మిషన్లు తెచ్చుకొని ఏడు ఎనిమిది బ్రాంచ్‌లు నడుపుతున్నారని ఆరోపించారు. విచారించి చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు.

అన్నదానం

కడప అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ వర్క్‌షాప్ టైర్ సెక్షన్‌లో వాల్కనైజర్ గా పని చేస్తున్న కొండారు రంగనాథ్ ,మల్లేశ్వరి కుమారుడు బద్రీనాథ్ జన్మదిన సందర్భంగా ఎల్ఐసీ క్వార్టర్స్ దగ్గర ఉండే స్నేహాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో నిరాశ్రయులు, వృద్ధులకు అన్నదానం చేశారు. నాగరాజు పేటకు చెందిన బొమ్మన కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా వీరి సతీమణి అంజనా దేవి, కుమారుడు జస్వంత్ రిమ్స్ హాస్పిటల్ లో రోగుల సహాయార్థం వచ్చు బంధువులకు స్నేహితులకు హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్ట పురుషోత్తం, దామోదర్, ఎలక్ట్రిషన్ మధు, రామ్మోహన్, దాతలు పాల్గొన్నారు.

తెలుగు జాతికి సురవరం' ప్రతాపరెడ్డి

కడప కల్చరల్ : తెలుగుజాతి బహుముఖ ప్రజ్ఞను, ఘనతను నలుదిశలా చాటి చెప్పిన ప్రత్యేకత సురవరం ప్రతాప్‌రెడ్డిదేనని కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రెడ్డి సేవా సమితి ప్రాంగణంలో సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతిని నిర్వహించారు. తొలుత ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. లెక్కల కొండారెడ్డి , సంస్థ అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి , వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి , డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు సురవరం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో విశ్వనాథ్ రెడ్డి, రెడ్డి సేవా సమితి హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను కలిసిన ఎన్జీఓ సంఘం నాయకులు

కడప అర్బన్: కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి.జమునను బుధవారం ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు కంభం చిన్నయ్య, ఉపాధ్యాయ సంఘాల సీనియర్ నాయకులు పొన్నోలు సుబ్బారెడ్డి, డాక్టర్ పొన్నోలు వివేకా నందరెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఛలో సిద్దేశ్వరం' తరలిరండి

కడప సెవెన్‌రోడ్స్ : రాయలసీమ శాశ్వత కరువు నివారణకు ఉద్దేశించిన సాగునీటి ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ ఈనెల 31వ తేది నిర్వహించనున్న ఛలో సిద్దేశ్వరం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కరీం బాష, రామచంద్రరాజు, కుందూ పరిరక్షణ సమితి నాయకులు పేరా శ్రీధర్‌రెడ్డి, కోవెలకుంట్ల యువ సమాఖ్య నాయకులు రాంపుల్లయ్య, సుబ్బారెడ్డిలు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా బుధవారం కడపకు వచ్చిన వారు విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు సిద్దేశ్వరంలో వేలాది మందితో బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ జయప్రదం చేయాలన్నారు.

సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని శివానందపురంలో భూమన పిచ్చమ్మ ఇంటిని కూల్చివేసిన ఘటనలో నామమాత్రపు బెయిలబుల్ సెక్షన్ లతో కేసు నమోదు చేసి కాల్ మనీ దందాతో మరో మారు మిలాఖత్ అయిన రిమ్స్ పోలీస్ స్టేషన్ సీఐ సీతారామి రెడ్డి, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ పై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి యస్. వెంకట శివ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివానందపురంలో మే 18వ తేదీన దళిత వృద్ధురాలు భూమన పిచ్చమ్మ ఇంటిపై బాల గురవయ్యతో పాటు మరో పదిమంది దాడి చేసి ఇంటి నుండి ఆమెను ఈడ్చివేసి, పత్రాలు, బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకుని ఇంటిని కూల్చిన అమానుషమైన ఘటన జరిగిందన్నారు. ఈ కేసులో విచారణ అధికారిగా నిందితులతో కుమ్మక్కైన ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఉన్న నేపథ్యంలో వారిని తప్పించి డీఎస్పీ స్థాయి అధికారిచే విచారణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మహానాడులో ట్రాఫిక్ కష్టాలు

వాహనాలు దారి మళ్లించేందుకు పోలీసుల ప్రయత్నాలు



మహానాడు మార్గంలో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయిన దృశ్యం



వాహనదారులను పార్కింగ్ స్థలాల వైపు మళ్లించేందుకు సూచనలిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

కడప అర్బన్/ కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలో మహానాడు రెండవ రోజు కూడా ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీవో కార్యాలయం సర్కిల్ నుంచి జయరాజ గార్డెన్ మీదుగా మహానాడు జరిగే పబ్బాపురం ప్రాంతానికి వెళ్లేందుకు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాలు రద్దీ ఎక్కువైంది. మహానాడు వేదికకు ఇవతల వైపు పార్కింగ్-3, అవతల వైపు సాక్షి సర్కిల్ నుంచి మహానాడు వేదిక సమీపం వరకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశాలంతా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ స్థలాలలో కార్లను పార్కింగ్ చేసేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, ఇతర జిల్లాల ఎస్పీలు స్వీయ పర్యవేక్షణ చేసి వాహనదారులను మళ్లించేందుకు నానా కష్టాలు పడ్డారు. ఒకవైపు మహానాడు ప్రధాన, రెండవ ప్రవేశ ద్వారాల వద్ద జనాలను ప్రతినిధులను పంపించే సమయంలో గుంపులు గుంపులుగా రావడం, తిరిగి వెళ్లడం ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించింది. కొందరు తమకు వీవీఐపీ పార్కింగ్ పాస్ లు ఉన్నాయంటూ పోలీసులతో వాగ్వాదం చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. మరో వైపు ద్విచక్ర వాహనాలు, ఆటోలను జయరాజ గార్డెన్స్ నుంచి చెర్లోపల్లి వైపు మళ్లించారు.

ప్రయాణీకులకు ఇక్కట్లు

తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం ఆర్టీసీ ప్రయాణీకులకు కష్టాలు తెచ్చిపెట్టింది. రెండు రోజులుగా కడప నగర శివార్లలోని పబ్బాపురం వద్ద నిర్వహిస్తున్న మహానాడు ముగింపు సందర్భంగా గురువారం బహిరంగసభ నిర్వహించనున్నారు. ఇందుకోసం భారీగా జన సమీకరణ చేపట్టారు. అధికారం తమ చేతిలో ఉన్నందున జనాన్ని తరలించేందుకు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. జిల్లాలోని ఆయా డిపోల నుంచి మహానాడుకు జనాలను తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కారణంగా రోజువారి కార్యక్రమాల్లో భాగంగా వివిధ చోట్లకు ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొంది.

బస్సుల కేటాయింపుపై మంత్రుల సమీక్ష..

మహానాడు బహిరంగసభకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు మరో మంత్రి నారాయణ రెండు రోజుల కిందట కడపలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏ ప్రాంతంలో ఎన్ని బస్సులు కేటాయించాలో దిశా నిర్దేశం చేశారు. ఇందుకు ఆర్టీసీ అధికారులు కూడా తమవంతుగా పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తున్నారు.

- మహానాడుకు అత్యధికంగా ఆర్టీసీ బస్సులను కేటాయించడంపై ప్రయాణీకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట అని తెలియజేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు ఇలా అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు కేటాయించడం ప్రయాణీకులను ఇబ్బందులు పెట్టడమేనని వాపోతున్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభకు కూడా ఆర్టీసీ బస్సులను పెద్ద ఎత్తున వినియోగించారు. ఈ నేపథ్యంలో ప్రయాణీకులు రెండురోజులు ఇబ్బందులు పడ్డారు. మళ్లీ టీడీపీ నాయకులు మహానాడు పేరుతో ఆర్టీసీ బస్సులను తీసుకుని తమను ఇబ్బందులు పెట్టడంపై ప్రయాణీకులు సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహానాడు చిత్రాలు



కూలిపోయిన బ్యానర్



మహానాడులో భోజన కష్టాలు



మహానాడులో జనంలేక ఖాళీ కుర్చీలు కన్పిస్తున్న దృశ్యం

మోడల్ డీఎస్సీకి స్పందన



అభ్యర్థికి ప్రశ్నాపత్రాన్ని అందచేస్తున్న డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మోడల్ డీఎస్సీకి స్పందన లభించిందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు ప్రాంతాలలో నిర్వహించామన్నారు. కడప యూటీఎఫ్ భవన్, వెంకటసాయి కోచింగ్ సెంటర్‌లో పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు ముఖ్య అతిథిగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా హాజరై డీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్ష ప్రతి ఒక్క అభ్యర్థికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బాగా చదివి ఉపాధ్యాయ పోస్టులు సాధించాలని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మోడల్ డీఎస్సీ విజయవంతంగా జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యకులు రెబ్బా నర్సింహులు, నగర కార్యదర్శి విజయ్, యూటీఎఫ్ నాయకులు గోపి, ప్రకాష్, జయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ బుధవారం కడప నగరంలో ఉన్న బాసట చిల్డ్రన్ హోమ్‌ను పరిశీలించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి పిల్లలు ఏయే తరగతులను అభ్యసిస్తున్నారు. తరగతి గదులలో విద్యార్థులు అభ్యసిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించారు. విద్య విలువైనదని క్రమశిక్షణతో అభ్యసించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేసవిలో పిల్లల విద్యా ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

బీసీలను ఉద్ధరించినట్లు అబద్ధాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

– వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్: మహానాడు వేదికగా బీసీలను ఉద్ధరించినట్లు టీడీపీ నాయకులు అబద్ధాలు మాట్లాడారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శి కె. శివయాదవ్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలకు ఒరిగిందేమీ లేదని, ఎన్నికల హామీల మేరకు బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఎప్పుడిస్తారో చెప్పాలన్నారు. రాయితీ రుణాలు ఇప్పటికీ మంజూరు చేయలేదని, అబద్ధపు హామీలతో కూటమి సర్కార్ బీసీలను మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు కేబినెట్‌లోనూ అత్యధికంగా బీసీలకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. బీసీలకు సామాజిక రాజకీయ గౌరవం జగనన్నతోనే సాధ్యమన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నేట్లపల్లి శివరామ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మొదటి నుంచి కూడా బీసీలను ఓటు బ్యాంక్ గా మాత్రమే చూశారని విమర్శించారు. బీసీలను కులవృత్తులకు, చేతి వృత్తులకు మాత్రమే పరిమితం చేయాలని చూస్తూ రాజ్యాధికారాన్ని దూరం చేశారన్నారు. బీసీల పక్షపాతిగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైఎస్ఆర్‌సీపీ బీసీ నేతల మీద భౌతిక దాడులు, హత్యా ప్రయత్నాలు అనునిత్యం జరుగుతున్నాయని, బీసీల గురించి మాట్లాడే నైతికత టీడీపీ నాయకులకు లేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షిండే రవిచంద్ర, ఉపాధ్యక్షులు బాదుల్లా, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : తెలుగు ప్రజల కోసం ఒక రాజకీయ పార్టీ ఉండాలని భావించి తెలుగుదేశం పార్టీని స్థాపించి అధికారంలోకి తీసుకొచ్చిన ఎన్టీ రామారావు ప్రజల మనిషి అని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్థానిక తమ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే రాయల్ కరీం సేవా సమితి అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు టి నారాయణ, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, నాగయ్య, పుల్లయ్య, సుబ్బరాయుడు, లక్ష్మయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో...

కడప ఎడ్యుకేషన్: తెలుగుజాతికి వన్నె తెచ్చిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ విశ్వనాథకుమార్ అన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కన్సెల్టెంట్ అనిల్‌కుమార్, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యోగి వేమన యూనివర్సిటీలో...

దివంగత సీఎం ఎన్.టి. రామారావు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలన భవనంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ , ప్రధానాచార్యులు ఆచార్య రఘునాథ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు.

దళిత, మైనార్టీలపై సర్కార్ థర్డ్ డిగ్రీ

– వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కడప కార్పొరేషన్: రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపై చంద్రబాబు సర్కార్ బహిరంగంగానే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు శింగమాల వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలిలో ఇద్దరు దళితులు, ఒక మైనార్టీ యువకుడిపై పోలీసులు అత్యంత దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను ఉల్లంఘిస్తూ మానవ హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. పోలీసులు అంతులేని అధికారంతో దళితులు, మైనార్టీలు, గిరిజనులు, బీసీల హక్కులను గౌరవించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం దారుణమన్నారు. లాఠీలతో కొడుతుంటే వారు బాధతో అరుస్తున్నా నవ్వుతూ పాశవికంగా దాడి చేయడం అన్యాయమన్నారు. ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బూటు కాలితో తొక్కిపట్టగా, మరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లాఠీలతో దాడి చేశారన్నారు. మిగిలిన వారు ఈ దాడిని వీడియో తీశారని, లాఠీలు విరిగిపోతే నవ్వుతూ కొత్తవి అందజేశారన్నారు. ఈ ప్రభుత్వంలో ఎంతటి భయానక వాతావరణం నెలకొందో చెప్పడానికి ఇదొక్కటే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. రాష్ట్రమంతటా ఇలాంటి ఎన్నో దారుణ, అమానవీయ దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తే కూటమి సర్కార్ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తోందన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీపై చర్యలు చేపట్టాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కార్యదర్శి జాల జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజు దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కడప ఓం శాంతినగర్‌లోని ఏఐఎస్‌బి జిల్లా కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కార్యదర్శి జాల జయవర్ధన్, పి.ఎస్.యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు, వై.ఎస్.ఆర్.యూ జిల్లా అధ్యక్షులు సాయి దత్త, పి.అర్.ఎస్.వై.ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, ఏ.ఐ.బి. ఎస్.ఎస్.జిల్లా కార్యదర్శి జగన్ నాయక్, ఏ ఎస్ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓబయ్యలు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, పి.ఎస్.యు జిల్లా కార్యదర్శి గోపి, వైయస్సార్.ఎస్.యూ నగర అధ్యక్షులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ చేపట్టిన తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆందోళనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు తాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు, అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్ వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు సి సుబ్రహ్మణ్యం , జి వేణుగోపాల్, బాదుల్లా, జి మద్దిలేటి, కే మునయ్య, శివతేజ, బత్తల అరుణ్ పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలలో తప్పిదాలను సవరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీలు ఒక ప్రహసనం లాగా మారాయని, బదిలీలలో తప్పిదాలను సవరించి సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఈ విషయమై డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ పాయింట్ల కేటాయింపులోను, పాత, కొత్త స్టేషన్ల పాయింట్లు నమోదు చేసుకోవడంలో ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా పాయింట్లు కేటాయింపు జరుగుతున్నాయన్నారు. రెండు డీఎస్సీల ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని దానిని పూర్తిగా సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహమ్మద్ కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, ప్రకాష్ బాబు, గురు మోహన్, మహబూబ్ బాష, గణేష్ బాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సమస్యలు మహానాడులో చర్చించాలి

కడప ఎడ్యుకేషన్: కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడులో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సమస్యలు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు పరిష్కరించే దానికి చొరవ చూపి చర్చించాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని పీడీఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప, అన్నమయ్య జిల్లాల ప్రజల చిరకాల కల కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసి, ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేల ఎకరాల్లో ఉన్న కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యు జిల్లా నాయకులు అఖిల్ నాయుడు, రాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి సన్నిధిలో పలువురు ప్రముఖులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడపకు వచ్చిన రాష్ట్ర మంత్రి వాసం శెట్టి సుభాష్, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణతోపాటు ఇతర రాజకీయ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు అమ్మవారి దర్శనం చేయించి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత గురించి వారికి వివరించారు.

కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని మహానాడులో తీర్మానం చేసి రాయలసీమ ప్రజలకు హామీ ఇవ్వాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ మక్బూల్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తే వేల మందికి ఉపాధి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కడప సమీపంలో జరుగుతున్న మహానాడు కూడా ఏదో గొప్పలు చెప్పుకోవటం కోసమే నిర్వహిస్తున్నట్లు ఉన్నాయని, మీ గొప్పలు కాకుండా రాయలసీమకు మీరు ఏం చేశారో, రాయలసీమ అభివృద్ధి కోసం ఈ మహానాడులో మీ ప్రభుత్వం ఏం ప్రణాళిక తీసుకొచ్చిందో రాయలసీమ ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు రాజువారిపేటలో బండలాగుడు పోటీలు

చాపాడు: మండలంలోని రాజువారిపేట గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి 16వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం పూజా కార్యక్రమాలతో పాటు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఓల్డ్ కేటగిరి వృషభరాజములచే నిర్వహించే బండలాగుడు పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.9 వేలు, రూ.7వేలు, రూ.5 వేలు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.